# స్వహస్తాలతో!

**కలపద భూషణ్**

[గుడిలో విగ్రహాన్ని మింగేవాడొకడైతే గుడినే మింగేవాడు యింకొకడు వుంటాడు" అన్నట్లు "అన్యాయార్జితం అన్యులపాలు" అన్నట్లు ఈ ఆంగ్లకథ అనుసరణ అందిస్తోంది. తన క్రింద పగలల్లా చెమటోడ్చి పనిచేస్తూండేవాళ్ళకి అధికలాభాలు వచ్చినా ఆర్థికంగా ఆనందపరచలేని చెట్టియార్ల లాభాలు పరులహస్తాల్లోకి యెలా నడుస్తాయోకూడా ఈ కథ సూచిస్తోంది.

—సం॥]

★

ఆ నగరంలో రత్నాల వ్యాపారస్తు లందరిలోను పెరుమాళ్ చెట్టియారు కొట్టు చాలపెద్దది, పలుకుబడిగలదీను. ఆ నగరం నలుమూలలనుండీ—పల్లెటూళ్ళనుండీ వాడుకదార్లు అతని కొట్టులో గుమిగూడేవారు. వ్యాపారంలోని నికర లాభం రోజుకు రోజు సరాసరి కొన్నివేల రూపాయలను మించేది. ప్రతిరోజూ, చెట్టియార్ బేంక్ బేలన్స అంతులేకుండా అమితమై పోతూన్నది.

లెక్కకు మించిన వాడుకదార్లు—అధికలాభాలు—మార్కెట్‌లో పలుకుబడీ కలిగి చెట్టియార్ పేరు మారుమ్రోగి పోయింది. కాని చెట్టియార్ యొక్క అమిత లోభత్వం, తన సిబ్బందిపై చూపే అనాదరణనూ క్రింది ఉద్యోగస్తులు కనిపెట్టుతూనే వున్నారు. తన క్రింది ఉద్యోగస్తులలో ఎవ్వరిపైనను అతనికి నమ్మక లేదు. ఎంత అవసరమైనా కొట్టువీడి ఎప్పుడూ వెళ్ళేవాడు కాదు—తను లేనప్పుడు వచ్చే లాభం తన ఉద్యోగస్థులు అపహరిస్తారనే భయంచేత!

ఆ రోజు పగలు పదకొండు గంటలవేళ అందమైన ఫోర్డుకారొకటి పెరుమాళ్ చెట్టియార్ కొట్టుముందు ఆగింది. ఆకారునుండి విలువైన ట్వీడు కోటును ధరించిన వ్యక్తి బైటకువచ్చాడు, తన సేవకునితోకూడా షాపులోనికి ప్రవేశించాడు. చెట్టియార్ ఒక్కచూపుతోనే—ఆ వచ్చిన వ్యక్తి 'ధనప్రపంచానికి' అంటే ఎవరు వేలుకూడా గవ్వలు లాభాలిస్తారో అటువంటి వారికి సంబంధించినవాడని గ్రహించాడు. పొంగిపొరలే సంతోషాన్ని అదిమిపెడుతూ—ఇప్పుడు తాను పొందబోయే పెద్ద లాభాన్ని తలచుకొని తనకు తనే ధన్యవాదా లర్పించుకొన్నాడు మనస్సులో.

ఆదరణతో చెట్టియార్ చూపించిన స్థలంలో ఆవ్యక్తి ఆసీనుడయ్యాడు. అతని సేవకుడు యాజమానికి వెనుక కొన్ని గజాల దూరంలో కడునమ్రతతో నుంచున్నాడు. చెట్టియార్ అప్పటివరకూ ఆ నూతన వ్యక్తి కుడిచేతి వ్రేళ్ళను సైతమూ కప్పుచూ ఒక బేండేజ్ కట్టబడివుందని గ్రహించలేక పోయాడు. తన కుడిచేతికట్టును తిలకిస్తూన్న చెట్టియార్‌నుచూసి ఆ నూతన వ్యక్తి చిఱునవ్వు నవ్వుతూ "హా—ఆ దెబ్బ, ఏమీ లేదండి...కొలదిరోజుల క్రితం స్వయంగా నా కారును నడుపుతూంటే ఒక ప్రమాదం జరిగింది—ఇప్పుడు సరిగానే వుంది...రెండు మూడు రోజుల్లో ఈ బేండేజ్ కూడా తీసివెయ్యగలుగుతానని అనుకుంటున్నాను... ...ఆ—మరి నాకు రత్న, కాంచన ఆభరణాలు అవసరంగా కావాలి. వెండివి కూడా!" అన్నాడు.

ఒక్క క్షణంలో చెట్టియార్ వివిధ రకాలైన ఆభరణాలను—కాలి అందెలు మొదలు కంఠాభరణాలవరకూ, వజ్రములతో కూర్చబడిన నెక్లెస్‌తో కూడా పరీక్ష చేసేందుకు తెప్పించాడు. ఆవ్యక్తి ఆనేకమయిన ఆభరణాలను, అందెలను, కమ్మలను, గొలుసులను, ఉంగరాలను—ఒక టేబిలుమీద అన్నివిధా

కైనవి కోరుకొని, చెట్టియార్‌ను తానెంత ధనమును వెచ్చింపవలసి వుంటుందో కనుక్కున్నాడు. చెట్టియార్ అన్నిటి విలువను లెక్కించి మొత్తం ఏడు వేల రూపాయలు అవుతుందని చెప్పాడు.

'సరిగానే వుంది!' అంటూ ఆవ్యక్తి ఎడమ చేతిని కోటు కుడివైపునవున్న లోపలి జేబులోనికి పోనిచ్చాడు. తక్షణమే అతని మోము ఆశ్చర్య మేఘాలతో నిండింది.

"ఎంత తెలివితక్కువ వాడ్ని!—ఇంట్లో 'పర్సు' వదలిపెట్టి వచ్చాను. ఉహూ...ఏమీ ఫరవా లేదు" అంటూ తనసేవకుడ్ని దగ్గరకుపిలిచి యిలా అన్నాడు. 'పర్సు' తీసుకురావడం మఱచిపోయాను, దానిని ఇనుపపెట్టెలో వదలివచ్చినట్టు జ్ఞాపకం... ఇంటికి వెళ్ళి నాభార్యతో చెప్పి తీసుకరా. పది నిమిషాల్లో తిరిగి రావాలి...ఇంకా ఎంతోకాలం నీకొఱకు ఎదురు చూడను.—సరే—నీవు నాదగ్గర నుండి చీటి తీసుక వెళ్ళితే చాలా మంచిది. ఏమంటావ్? ... ...

'క్షమించండి చెట్టియార్ గారు!......ఒక కాగితం దయచేస్తారా?...కాని స్వంతంగా వ్రాయవలది గానందుకు విచారిస్తూన్నాను...ఒకటి రెండు రోజులు గడుస్తేనే గాని ఈ చేత్తో వ్రాయలేను... చెట్టియార్ గారూ ఒక్క నిమషం నాకొఱకు వెచ్చిస్తారా. నాకొఱకు ఒక చిన్న 'మెమో' ఒకటి వ్రాసి చెట్టాలి.... దాన్ని నాభార్యకు పంపవలసిన అవుసరంవుంది... ..."

"ఓ—అదెంతపని. సంతోషంతో చేస్తాను.' అన్నాడు చెట్టియార్ చిన్న కాగితం తీసుకొంటూ! ఆ వ్యక్తి చెప్పుతూంటే, చెట్టియార్ ఈ క్రింది విధంగా వ్రాశాడు:

"Dearest. ఈ చీటీ తెచ్చినవానితో ఏడు వేల రూపాయలను మాత్రమే పంపు. నేనుకొట్టులో వున్నాను. స్వయంగా రావటానికి వీలు లేదు.... ఈ చీటీ తెచ్చేవాడు నమ్మకమైన వాడు ...ధనం క్రింద రహస్యపు గదిలో వున్న ఇనుప పెట్టెలో వుంది......"

ఉత్తరం పూర్తిచేసి, చెట్టియారు 'మీరు సంతకం చేసి ఇవా వానికివ్వవచ్చు' అంటూ అతని చేతి కందించారు కాగితాన్ని అతడు నవ్వుతూ "వేళ్ళ సహాయం లేనిదే నేనెలా సంతకం చేయగలను?... ఏమి ఫరవాలేదు...నాభార్య అర్థంచేసుకొంటుంది!" అన్నాడు.

తన సేవకుడ్ని ఆఉత్తరం తీసికువెళ్ళి కొంచెం ఆలస్యం కూడా చేయకుండా ధనంతో తిరిగి రమ్మని ఆజ్ఞాపించాడు.

పది నిమిషాలు గడచినవి...పదుహేను నిమిషములుకూడా దాటినవి ... అర్ధగంట కూడా అయ్యింది....కాని అతని సేవకుడు తిరిగి రాలేదు. ఆ వ్యక్తి మిక్కిలి ఆత్రుత జెందాడు.

ఆయుర్వేద వైద్యనిలయం - వారి

"లూకోరియాక్యూర్"

అద్భుత కుసుమరోగనివారిణి.

స్త్రీలకు తరుచు సంభవించు శ్వేతరక్త ప్రదరరోగములకు, బహిష్టు నొప్పులకు దివ్యౌషధమని 10 సం॥ అనుభవముచే చెప్పగలుగుచున్నాము. ఇంకను దీనిని సేవించుటవలన ఇతర గర్భాశయ వ్యాధులను కూడ నిర్మూలించి వంధ్యత్వమును తొలగించును. అనేకమంది దీర్ఘరోగులకు వాడి గుణము కనుగొనబడిన ఆయుర్వేద ఔషధము.

90 మాత్రల ప్యాకెట్లు—వెల రు. 2-8-0.

ప్యాకింగు పోస్టేజి అదనము.

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడుపేట, మచిలీపట్నం.

అన్ని పట్టణములలో స్టాకిస్టులు కావలెను.

"వాడు ఉత్తవెధవ — నన్ను ఇలా ఇంత వరకు కూర్చోబెట్టాడు. ఈ భూమి మీద వాడు యేం చేస్తున్నాడో నాకర్థం కావడం లేదు!... ఇంకా ఎదురు చూస్తూ కూర్చుంటె లాభం లేదు. స్వయంగా వెళ్ళి పని నెరవేర్చుకు వస్తాను! ... క్షమించండి, మిష్టర్ చెట్టియార్. ఈ నగలను నేను వచ్చేవరకు ఇక్కడే వుంచండి...ఐదు నిమిషాల్లో నేనిక్కడకు వస్తాను. ...వందనాలు!"

"సరే—అలానే" అన్నాడు చెట్టియార్.

దైవవశాన్న అప్పుడే దొరికిన టాక్సీలో ఆ వ్యక్తి కొట్టువీడి వెళ్ళిపోవటం చెట్టియార్ గమనిస్తూన్నాడు. రెండుక్షణాల్లో ఆ టేక్సీ మటుమాయమైంది.

చెట్టియార్ అరగంటవరకూ ఎదురు చూసాడు. ఇంతవరకు ఆ వ్యక్తి తిరిగి రాలేదు. ఆ రాత్రి కొట్టు మూసేంతవరకూ చెట్టియార్ ఆవ్యక్తి రాకకు ఎదురు చూస్తూన్నాడు...కాని ఫలితం లేకపోయింది... అతనికేమి తటస్థించిందో అని ఆశ్చర్య పోయాడు— చెట్టియార్. ...

చాలా రాత్రి గడిచిన తర్వాత, చెట్టియార్ యింటికి వెళ్ళినప్పుడు, భార్య ఆతృతా వీక్షణాలతో "ధనం సరిగా మీకుఅందినదా?" అని అడిగింది.

చెట్టియార్ ఆశ్చర్యచకితుడయ్యాడు. కొయ్య బారిపోయి 'ఏధనం'? అని అడిగాడు.

ఆ ప్రశ్నకు మరింతంఆశ్చర్య పోయింది, అతని భార్య "ఏమి డబ్బు?...అలా అంటారే! ప్రొద్దుట పదకొండు గంటలవేళ నేను పంపిన డబ్బు...ఏడు వేల రూపాయలు అతని చేతికివ్వమని. మీ స్వహస్తంతో ఒక ఉత్తరం వ్రాసి నాకు పంప లేదు?... మీరు చెప్పినట్టిగా క్రిందిరహస్యపు గదిలోని ఇనుప పెట్టెనుండి తీసాను — నేను వీధిలోని వ్యక్తిచే మోసపోయేంత తెలివి తక్కువ దాన్నని మీరనుకున్నారా?...ఎందుకు?...ఏమి జరిగింది?......"

చెట్టియార్ తన భార్యకు ఏవిధమైన జవాబు చెప్పలేదు. ...అతడు ఇంతకు ముందే స్పృహ తప్పి పోయాడు!!


ఉదయం ఆయాసం

దేహములోని శక్తి అధికముగా వ్యయమౌటవల్లనే నిస్సత్తువ యేర్పడుతుంది. అధికముగా వ్యయమయ్యే యీ జీవశక్తిని తిరుగా సమకూర్చుకొనుటకు సకాలములో శ్రద్ధవహింపకపోతే, మీ దేహము దారుణమైన బలహీనతకు యెరయౌతుంది. కనుక వెంటనే జీవామృతముద్వారాఅధికశక్తిని సమకూడ్చుకోవలెను. జీవామృతములోనిప్రతియొక్క బిందువు పుష్టిదాయకమైనది; చైతన్యదాయకమైనది. అంతేగాక ఆరోగ్య బలములను ప్రసాదించును. ఏబది సంవత్సరములుగ ప్రసిద్ధిగన్న భారతీయ టానిక్కు జీవామృతము అని సర్వదా జ్ఞాపకముంచుకొనుడు.



ఇంతటి దారుణమైన నీరసాన్నికూడా నిర్మూలించగల ఉత్తమ రసాయనం.

జీవామృతము

(అన్ని మందుల షాపులలోను దొరకును)
ఆయుర్వేదాశ్రమము లిమిటెడ్,
79, గోవతి నారాయణచెట్టి రోడ్,
త్యాగరాయనగర్, మద్రాసు.